بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 23 Oct 2026 (Telugu)

సంతృప్తి, సాధారణ జీవినం మరియుల నిరాడంబరతలో
మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శం జీవితం

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 23.10.2026
తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۝ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۝ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ ۝ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۝ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۝

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి నిరాడంబర జీవితం గురించి ప్రస్తావించడం ప్రారంభించాను. ఆయన సామాజిక జీవితంలో ఎంత నిరాడంబరంగా ఉండేవారంటే, కొన్నిసార్లు తమకు కావలసిన వస్తువులను స్వయంగా మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేసేవారు.

హజ్రత్ అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన ప్రకారం, ఒకరోజు నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారితో కలిసి మార్కెట్‌లోకి ప్రవేశించాను. ఆయన ఒక బట్టల వ్యాపారి వద్ద కూర్చున్నారు. ఆ తర్వాత నాలుగు దిర్హమ్‌లకు ఒక పైన వేసుకునే సడలైన పైజామాను కొనుగోలు చేశారు.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా నుండి మరొక కథనం ఉంది. ఆమె ఈ విధంగా చెప్పారు. హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు నా వద్దకు వచ్చారు. ఆ సమయంలో నా దగ్గర అన్సార్‌లకు చెందిన ఇద్దరు బాలికలు కొన్ని కవితలను పాడుతుండిరి. వారు వృత్తిపరమైన గాయకురాళ్లు కారు, వారు నా స్నేహితురాళ్లు మాత్రమే అని హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా తెలిపారు. హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు ఆ పాటల శబ్దాన్ని విని ఇదేమిటి, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఇంట్లో మీరు షైతాన్ వేణువులను (పాటలు పాడటం) పెట్టుకుని కూర్చున్నారు? అని అన్నారు. అది పండుగ రోజు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇది విని ఓ అబూ బకర్! ప్రతి దైవ సమాజానికి ఒక పండుగ ఉంటుంది. ఇది మన పండుగ. కాబట్టి వారిని పాటలు పాడనివ్వండి, వారిని అడ్డుకోకండని చెప్పారు.

హుజూరె అన్వర్ ఇట్లు వివరించారు: అది చాలా నిరాడంబరమైన, సహజమైన వాతావరణం, అక్కడ ఎలాంటి అన్యారాధన మాటలు జరగడం లేదు, కాబట్టి వారిని పాటలు పాడనివ్వండి. దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పిల్లల దగ్గర నుండి వెళ్తున్నప్పుడు వారికి సలాం చేసేవారు, వారి తలపై చెయ్యి నిమిరి ప్రేమగా నిమిరేవారు మరియు వారి కోసం దుఆ చేసేవారు. ఎవరైనా వ్యక్తి ఆయనతో కలిసి కూర్చున్నా, లేదా ఏదైనా అవసరం కోసం ఆయనతో మాట్లాడినా, ఆ వ్యక్తి స్వయంగా లేచి వెళ్లేంత వరకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చాలా ఓపికతో, సహనంతో అతనితో కూర్చుని ఉండేవారు. ఈ నిరాడంబరత, సహనం, వచ్చే వ్యక్తికి తన విషయాన్ని ప్రశాంతంగా చెప్పుకోవడానికి ఓదార్పును మరియు ధైర్యాన్ని ఇచ్చేవి. కాబట్టి, ఇది మన బాధ్యులు (అధికారులు) కూడా తప్పకుండా అలవర్చుకోవాల్సిన విధానం.

హజ్రత్ ఇమామ్ హుస్సేన్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు. నేను నా తండ్రి గారిని దైవ ప్రవక్త

సల్లల్లాహు అలైహి వసల్లం గారి సభల గురించి అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చున్నా, లేచినా అల్లాహ్ స్మరణ చేస్తూ ఉండేవారు. ఆయన ఏదైనా సమూహం వద్దకు వెళ్ళినప్పుడు, ఆ సభ ఎక్కడ ముగిస్తే అక్కడే ఆసీనులయ్యేవారు. ఆయన తన వద్ద కూర్చున్న ప్రతి ఒక్కరికీ తగిన హక్కును, గౌరవాన్ని ఇచ్చేవారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దృష్టిలో మరొకరు తన కంటే ఎక్కువ గౌరవనీయులని అక్కడ ఉన్న ఏ ఒక్కరూ భావించేవారు కారు. ఆయన ఔదార్యం, సత్ప్రవర్తన అందరికీ సమానంగా ఉండేవి. ఆయన వారందరికీ తండ్రి వంటి స్థానంలో ఉండిపోయారు.

మదీనా వలస సమయంలో ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం కుబా వెలుపల ఒక చెట్టు కింద కూర్చుని ఉన్నప్పుడు, ఆ సమయంలో మదీనా వాసులలో అధిక ప్రజలకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముఖ పరిచయం ఇంకా లేదు. ప్రజలు హజ్రత్ అబూ బకర్ (రజి) ను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంగా భావించి, ఎంతో భక్తిశ్రద్ధలతో ఆయన వైపు ముఖం చేసి కూర్చునేవారు. హజ్రత్ అబూ బకర్ (రజి) ఇది చూసి వెంటనే తన దుప్పటిని తీసి, సూర్యునికి అడ్డుగా నిలబడి ఓ దైవ ప్రవక్తా సల్లల్లాహు అలైహి వసల్లం! మీపై ఎండ పడుతోంది, నేను మీకు నీడ పడతానని అన్నారు.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా రజియల్లాహు అన్హు ఉల్లేఖిస్తూ ఇలా చెప్పారు: ఒకసారి నేను అనారోగ్యానికి గురయ్యాను, అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు నా ఇంటికి వచ్చారు. వారు నన్ను స్పృహలేకుండా చూశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వుజూ చేసుకొని ఆ వుజూ నీటిని నాపై చల్లగా నాకు స్పృహ వచ్చింది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితంలో ఎలాంటి కృత్రిమత్వం (ఆడంబరం) లేకెండెను, పూర్తి నిరాడంబరత ఉండేది. ఆయన తన అనుచరులకు కూడా ఇదే విషయాన్ని బోధించేవారు మీరు నిరాడంబరతను అలవర్చుకోండి, తద్వారా మీ నైతిక సంస్కరణ కూడా జరుగుతుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన ప్రకారం బద్ర్ యుద్ధం రోజున ముగ్గురు వ్యక్తులు ఒకే ఒంటెపై వంతులవారీగా స్వారీ చేసేవారు. దైవ ప్రవక్త (స) తో పాటు ప్రయాణిస్తున్న వారు ఓ దైవ ప్రవక్తా! మీరు ఒంటెపై స్వారీ చేయండి, మేము నడుచుకుంటూ వస్తామని అన్నారు. దానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం బదులిస్తూ మీరిద్దరూ నాకంటే ఎక్కువ బలవంతులు కాదు, అలాగే పుణ్యం సంపాదించుకునే విషయంలో నేను మీరిద్దరిపై ఆధారపడకుండా ఉండలేను (నాకూ పుణ్యం కావాలి). కాబట్టి ఏ నియమమైతే నిర్ణయించబడిందో, దాని ప్రకారమే అమలవుతుందని చెప్పారు.

హజ్రత్ అమ్ర్ బిన్ హారిస్ రజియల్లాహు అన్హు ఉల్లేఖిస్తూ ఇలా చెప్పారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ ఒక్క దినార్‌నుగానీ, దిర్హమ్‌నుగానీ, దాసుడినిగానీ, దాసినిగానీ వదిలి వెళ్లలేదు. ఆయన ప్రయాణించే తన తెల్లటి కంచరగాడిద, తన ఆయుధాలు, బాటసారుల కోసం ఆయన దానం చేసిన ఒక భూమి తప్ప మరేమీ వదిలి వెళ్ల లేదు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఇట్లు ప్రవచించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అత్యుత్తమమైన ఆహారాన్ని కూడా భుజించారని నిరూపితమైంది, అలాగే ఆయన ఉపవాసాలు చేశారని కూడా నిరూపితమైంది. కొన్నిసార్లు ఎంత సుదీర్ఘమైన ఆకలితో ఉన్నారంటే, ఆయన తన కడుపు (పొట్ట) కు రాయి కట్టుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, ప్రతి పరిస్థితిలోనూ ఆయన జీవితం కృతజ్ఞత, నిరాడంబరతతోనే గడిచింది.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితం ఎంతో నిరాడంబరంగా ఉండేది. ఆయన ఏ పని చేయడానికీ నామోషీగా, అవమానంగా భావించేవారు కారు. ఆయన తన ఒంటెకు స్వయంగా మేత వేసేవారు, ఇంటి పనులు చేసుకునేవారు, తన చెప్పులను స్వయంగా

కుట్టుకునేవారు, చినిగిన దుస్తులకు కుట్టుకునేవారు, సేవకుడిని తనతో పాటు కూర్చోబెట్టుకుని భోజనం పెట్టేవారు, పిండి విసురుతూ అతడు అలసిపోతే అతనికి సహాయం చేసేవారు. మార్కెట్ నుండి ఇంటికి సరుకులు మోసుకురావడానికి సిగ్గుపడేవారు కారు. ధనవంతులు, పేదలు అందరితోనూ కరచాలనం చేసేవారు, సలాం చేయడంలో చొరవ తీసుకునేవారు. ఎవరైనా ఖర్జూరపు విందుకు పిలిచినా దానిని చిన్నచూపు చూడకుండా స్వీకరించేవారు. ఆయన ఎంతో దయాళువు, మృదు స్వభావి మరియు శీలవంతులు. ఆయన జీవనశైలి ఎంతో నిరాడంబరంగా ఉండేది, ఎల్లప్పుడూ ప్రసన్నతతో కనిపించే వారు, ఆయన ముఖంలో చిరునవ్వు ఉట్టిపడేది. ఆయన గట్టిగా కేరింతలు కొడుతూ నవ్వేవారు కారు. దేవుని భయంతో ఆలోచనాత్మకంగా ఉన్నప్పటికీ, ఆయన ప్రవర్తనలో ఎలాంటి కఠినత్వం లేదా కోపం ఉండేది కాదు. ఆయన అత్యంత వినయశీలి, కానీ అందులో ఎలాంటి బలహీనత లేదా ధైర్యహీనత లక్షణం కూడా ఉండేది కాదు. ఆయన ఎంతో ఉదార స్వభావి, కోమల హృదయుడు మరియు దయామయుడు. ప్రతి ముస్లిం పట్ల దయతో వ్యవహరించేవారు. తేన్పులు (ఆవలింతలు) వచ్చేంతగా ఎన్నడూ కడుపు నింపుకుని తినేవారు కారు. ఎన్నడూ అత్యాశ లేదా పేరాశతో చేయి చాచలేదు, పైగా ఎల్లప్పుడూ సహనం, కృతజ్ఞత కలిగి, ఉన్నదానితోనే తృప్తిపడేవారు.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇట్లు ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బహుమతులను స్వీకరించేవారు మరియు తాము కూడా బహుమతులు పంపేవారు. అది అతి చిన్న బహుమతి అయినప్పటికీ ఆయన దానిని స్వీకరించి, ప్రతిగా వారికి కూడా బహుమతి ఇచ్చేవారు. ఆయన ఏనాడూ ఏ ఆహారాన్ని కూడా తప్పుపట్టలేదు. అది ఆయనకు నచ్చితే భుజించేవారు, లేదంటే దానిని అలాగే వదిలేసేవారు.

ఆయన పష్మ్ అనగా గరుకైన ఉన్ని వస్త్రాన్ని ధరించారు, మరమ్మతు చేయబడిన చెప్పులను వేసుకున్నారు. ఆయన ఎల్లప్పుడూ కఠినమైన ఆహారాన్ని భుజించారు (అంటే గొంతు దిగడానికి నీరు అవసరమయ్యే మందపాటి బార్లీ రొట్టె) మరియు సాదాసీదా దుస్తులను ధరించారు.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తమ కవచాన్ని కొంత బార్లీ ధాన్యం కోసం కుదువ పెట్టారు. ఆయన ఒకసారి రొట్టె ముక్కపై ఒక ఖర్జూరాన్ని ఉంచి, ఇది దీని కూర అని అన్నారు. ఈ విధంగా ఖర్జూరంతో కలిపి రొట్టెను భుజించారు. ఒకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమక్షంలోకి వేడి ఆహారం తీసుకురాబడింది. ఆయన దానిని భుజించి అల్లాహ్‌కే సమస్త స్తుతులు, ఇన్ని రోజుల తర్వాత వేడి ఆహారాన్ని తిన్నానని అన్నారు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇట్లు తెలిపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన సమయంలో, మేము ఖర్జూరం, నీళ్లతో కడుపు నింపుకునే స్థితిలో ఉన్నాము.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలామ్ ఈ విధంగా తెలిపారు: వారు పశువుల వలె తింటారు మరియు నరకాగ్ని వారి నివాసం అని దేవుడు ఎవరి గురించి ఐతే చెప్పాడో అటువంటి వారి కడుపు నిండటంతో పరిశుద్ధులు మరియు పవిత్రులైన వ్యక్తులు కడుపు నిండా తినడం అనేది సమానం కాదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదైనా సందర్భంలో కడుపు నిండా తినడం అనేది ఒక ప్రత్యేకమైన దివ్యమైన వెలుగు. కేవలం భౌతిక ఆనందాలను పొందడమే అసలు ధ్యేయంగా పెట్టుకుని, తమ స్వార్థపూరిత కోరికల పూర్తికే తమ దృష్టిని పరిమితం చేసుకునే వ్యక్తులతో ఈ నిండటాన్ని పోలిస్తే, దానిని మనం ఏమాత్రం కడుపు నిండటం అని అనలేము. కడుపు నిండటం అనే పదానికి పవిత్రులు, పరిశుద్ధుల నిర్వచనం వేరు, అపవిత్రులు, తిండిపోతుల నిర్వచనం వేరు. పవిత్రులైన ప్రజలు ఆకలి కొంతవరకు తీరి, తమ కార్యకలాపాలు నిర్వహించడానికి తగిన శక్తి లభించేంత ఆహారాన్ని తినడాన్నే కడుపు నిండటం అని పిలుస్తారు. సారాంశమేమిటంటే ఒక విశ్వాసి కడుపు నిండటం అనగా తన నడుమును నిటారుగా ఉంచి, చేయాల్సిన విధులను నిర్వర్తించడానికి కావలసినంత ఆహారం తినడం మాత్రమే. కాబట్టి, సయ్యిదుల్ ముర్సలీన్ (ప్రవక్తలలో శ్రేష్ఠులైన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) కడుపు నిండటాన్ని

సాధారణ ప్రజల కడుపు నిండటంతో పోల్చడం తప్పు. ఈ కారణంగానే చాలామంది ఆయన గొప్ప స్థానాన్ని అర్థం చేసుకోలేకపోయారు, పదాల ఉపయోగాన్ని సరిగ్గా గమనించక తమను తాము పొరపాటులో పడేసుకున్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదైనా ఒక సందర్భంలో నా కడుపు నిండిందని చెప్పడం తినడమే తమ జీవిత ఏకైక లక్ష్యంగా భావించేవారి మాటల లాంటిది అస్సలు కాదు. మొత్తానికి, పవిత్రులైన మహనీయుల పనులను మరియు మాటలను వారి ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థాయికి తగినట్లుగానే అర్థం చేసుకోవాలి. వారి విషయాలను ఇతరులతో పోల్చడం సరైనది కాదు. వారు భౌతికంగా ఈ ప్రపంచంలోనే ఉన్నట్లు కనిపించినప్పటికీ, నిజానికి వారు ఈ లౌకిక ప్రపంచానికి అతీతంగా ఉంటారు.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇట్లు తెలిపారు: నేను ఒక రోజులో రెండుసార్లు కడుపు నిండా భోజనం చేసి నప్పుడల్లా నాకు దుఖం వస్తుంది. దానికి ఎందుకు ఏడుపు వస్తుంది? అని అడుగగా, ఆమె ఇలా అన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రపంచాన్ని వీడి వెళ్ళిన నాటి ఆయన పరిస్థితి నాకు గుర్తుకొస్తుంది. అల్లాహ్ తఆలా ప్రమాణంగా! దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏనాడూ ఒకే రోజులో రెండుసార్లు రొట్టె మరియు మాంసంతో కడుపు నింపుకుని తినలేదు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉబైద్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమక్షంలోకి ఆహారం తీసుకురాబడింది. అప్పుడు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు దేనినైనా ఆనుకుని భుజించండి, అది మీకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని మనవి చేశారు. దానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తన నుదుటిని నేల వైపుకు ఎంతగా వంచారంటే, అది దాదాపు నేలను తాకేంత దగ్గరకు వచ్చింది. ఆ తర్వాత ఆయన నేను ఒక సాధారణ దాసుడు తిన్నట్లే తింటాను మరియు సాధారణ దాసుడు కూర్చున్నట్లే కూర్చుంటాను, ఎందుకంటే నేను కేవలం ఒక దాసున్ని మాత్రమే అని చెప్పారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలామ్ ఈ విధంగా తెలిపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితాన్ని అధ్యయనం చేయండి, తద్వారా ఆయన ఎంతటి సత్ప్రవర్తన (మృదుస్వభావం) కలిగినవారో మీకు తెలుస్తుంది. ఆయన ఎంతో గంభీరమైన వ్యక్తిత్వం కలిగినవారైనప్పటికీ, ఒక బలహీనమైన లేదా వృద్ధురాలైన స్త్రీ ఆయనను నిలబెట్టినా, ఆమె అనుమతి ఇచ్చేంత వరకు ఆయన అలాగే నిలబడి ఉండేవారు.

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ అయ్యదయాహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి స్థానం ఎంతో ఉన్నతమైనది మరియు ఆయన ప్రతి చర్యలోనూ ఒక ఆదర్శం ఉంది.

اَللّٰھُمَّ صَلِّ عَلٰی مُحَمَّدٍ وَّعَلٰی اٰلِ مُحَمَّدٍ وَّ بَارِکْ وَسَلِّمْ اِنَّکَ حَمِیْدٌ مَّجِیْدٌ

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔